క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలోని పలు పోలింగ్ బూత్‌లను నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రవికాంత్, సీఐ ఎం. శ్రీనివాసరావు శుక్రవారం సిబ్బందితో సందర్శించారు. నగరంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్ల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఘనంగా శక్తేశ్వరస్వామి ఉత్సవాలు



మంగళగిరి: మంగళగిరి మండలం నూతక్కిలో శక్తేశ్వరస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గురజాడ కళామందిర్ వేదికపై రంగస్థల నటుడు అన్నపురెడ్డి శివరామిరెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ రంగస్థల నటుడు, దర్శకుడు పేరైడ్డిని స్థానిక కళాకారులు సంజీవరెడ్డి, సుబ్బారెడ్డి సన్మానించారు. ఇదే వేదికపై బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

పెద కోనేరు అభివృద్ధి పనులు పునఃప్రారంభం

- త్వరితగతిన భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తాం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



పెద కోనేరు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద కోనేరు (కళ్యాణ పుష్కరిణి) అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులను మంజూరు చేసిందని, త్వరలోనే పనుల్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి పెద కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఇప్పటికే పూడికతీత పనులు పూర్తి కాగా కోనేరుకు తూర్పు భాగంలో దశాబ్దాల కిందట పిడుగుపాటు గుర్రై దెబ్బతిన్న ప్రాంతాన్ని ఇటీవల గ్రౌడింగ్ చేయించి మెట్ల పునఃనిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. గత నెల రోజులుగా కార్మికుల కొరత కారణంగా పనులు నిలిచి పోయాయని తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. తొలుత కోనేరులో వేంచేసియున్న ఆంజనేయ స్వామికి ఎమ్మెల్యే ఆర్కే, నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం పరిశీలన

దేవస్థానం వెనుక వైపు ఉన్న పార్కింగ్ స్థలాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ,ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి లు శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ స్వామిబ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. 8న కల్యాణం, 10న దివ్య రథోత్సవం జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, ఈఓ జేవీ నారాయణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రూ.3లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

నగరపాలక సంస్థ పరిధి రాజీవ్ సెంటర్‌లోని డీఎస్ఆర్ ప్లాజా రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే ఆర్కే,ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవిలు పరిశీలించారు. సుమారు రూ.3లక్షల రూపాయల ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో శనివారం నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

కమ్యూనిటీ హాలులో మౌలిక సదుపాయాల కల్పన

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో గల కమ్యూనిటీ హాలులో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో శుక్రవారం కార్పొరేషన్ నిధులతో కమ్యూనిటీహాల్ చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను, బోర్‌ను ఆయన నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు, వడ్డేశ్వరం పార్టీ కన్వీనర్ గొడవర్తి శ్రీను, గ్రామ పెద్దలు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్ పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న చర్మకారుల భవనం

తాడేపల్లి పట్టణ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డు వెంబడి ఐవోసీ వద్ద ఏర్పాటు చేస్తున్న చర్మకారుల భవనం నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఈ నిర్మాణాన్ని శుక్రవారం మాజీ మంత్రి, ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాపులను త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామని చెప్పారు. పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి చర్మకారుల భవనం వద్ద ఏర్పాటు చేసేందుకు బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని అందజేశారని, దాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు, మంగళగిరి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు , తాడేపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాచర్ల అబ్బు, ఎం.డి. గోరే, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రకాష్, అనిల్, దాసు, మహేష్, గాలయ్య, ఉదయరాజు, బొందలపాటి శ్యామ్, ఏసుపాదం, సాంబయ్య, జిలాని, ఉండ్రు కల్యాణ్, అంజిరెడ్డి, రొడ్డా ఎలీషా, కుంచాల శ్రీను పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు

మంగళగిరి: నగరంలో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లకు అడ్డంగా, బహిరంగ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం, వాల్ పోస్టర్లు అంటించడం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అనుమతి పొందిన తరువాతనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన అవసరం

తాడేపల్లి రూరల్ : క్షయ వ్యాధి నివారణపై నర్సింగ్ విద్యార్థులంతా అవగాహన పెంచుకోవాలని దుగ్గిరాల ప్రభుత్వ వైద్యులు ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడిలోని మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ మనిషిలో రోగనిరోధకశక్తి తగ్గితే అనేక రకాల వ్యాధులు వస్తాయని, ముఖ్యంగా క్షయవ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ ఉందని వివరించారు. వ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధిగ్రస్తులు వాడే వస్తువులను మరొకరు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి. రవికుమార్, పీఆర్వో హనుమాన్, కళాశాల సిబ్బంది సౌజన్య, తుమ్మపూడి ఎంఎల్‌హెచ్‌పీ అచ్యుత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ లైనుల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నాగరాజుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

ఫిరంగిపురంలో రక్షిత నీటి పథకం ప్రారంభం

- రూ. 20లక్షలతో ఫిల్టర్లకు మరమ్మతులు
- సాయం చేసిన జర్మన్ దేశస్తులు, పువ్వాడ ట్రస్ట్



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జర్మన్ దేశస్తులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కోనేరు రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత శుక్రవారం ప్రారంభించారు.కొంత కాలంగా పథకం ఫిల్టర్లు పని చేయకపోవడంతో గ్రామస్తులు మంచినీటికి ఇబ్బంది పడుతున్నారు. స్పందించిన గ్రామానికి చెందిన రామిశెట్టి శిల్ప జర్మనీలో తాను పని చేసే కంపెనీ యజమానులైన థామస్ మొల్లా, రాయేట్‌లింగిన్‌లతో మాట్లాడి వారితో రూ. 15 లక్షల వరకు విరాళం అందేలా చేశారు. పువ్వాడ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వెంకటేశ్వరరావు మరో రూ. 5లక్షలు సాయం చేశారు. మొత్తం రూ. 20లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్లు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముందుగా బాల ఏసుదేవాలయ విచారణ గురువు పి.బాలస్వామి ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, సర్పంచ్ మేడాబాబు, లక్ష్మయ్య, ఎస్.నాగరాజు, రామిశెట్టి జోజప్ప, సీహెచ్. రామ్మోహన్ రెడ్డి, పి.చిన్న, డి. నరేంద్రకుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోరారు. ఆయన్ను కుంచనపల్లిలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధిత పసుపు రైతుల ఐక్యకార్యాచరణ కమిటీ కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నష్టపోయిన పసుపు రైతులకు ప్రస్తుతమున్న మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వ నిధుల నుంచి లేదా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణమే ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు. అనంతరం స్పెషల్ అగ్రికల్చర్ కమిషనర్ సీహెచ్. హరికిరణ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కందుల విఠల్‌రెడ్డి, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య,హనోక్, పసుపు రైతులు పాల్గొన్నారు.

చలపతిలో ఉద్ఘోష్- 2024 ప్రారంభం



మాట్లాడుతున్న ఇండియన్ సర్వర్స్ సీఈవో సాయి సతీష్

మోతడక(తాడికొండ): సమస్యలకు పరిష్కారం చూపే దిశగా విద్యార్థులు అడుగులేస్తే భావి ఇంజినీర్లుగా ఎదగడం సులభమే అని ఇండియన్ సర్వర్స్ సీఈవో సాయి సతీష్ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఉద్ఘోష్-2024 టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చలపతి విద్యా సంస్థల కార్యదర్శి వై. సుజిత్ కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు, కామెంట్‌లకు స్వస్తి పలికి సమయాన్ని వృథా చేయకుండా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళితే ఉద్యోగాల కోసం అన్వేషించకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగవచ్చని సూచించారు. విద్యా సంస్థల కార్యదర్శి వై. సుజిత్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు విద్యా రంగంలో వస్తున్న అధునాతన సాంకేతికతను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అనంతరం రిబ్బన్ కత్తిరించి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా హాజరైన సినీ హీరో అట్లూరి రక్షిత్ విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. శశి వధన్ మూవీ టీజర్, పాటలు ప్రదర్శించి విద్యార్థులతో కలిసి డాన్స్ చేశారు. వివిధ క్రీడలలో గెలుపొందిన విజేతలకు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, వై అనంత కుమారి, సుజిత్ కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. నాగ శ్రీనివాసరావు, ఉద్ఘోష్ కన్వీనర్లు సాయి శ్రీనివాస్, నాగ రవికిరణ్, కల్చరల్ అండ్ క్రీడా కో ఆర్డినేటర్లు బి. తులసీరాణి, డి. రాము, పి. బాలమురళీకృష్ణ, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, పలు కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతూరులో అదుపు తప్పిన ఇసుక లోడు వాహనం

- మద్యం మత్తులో డ్రైవర్
- భారీగా ట్రాఫిక్ జామ్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన మరో సంఘటన
- ఇంట్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్



అదుపు తప్పిన లారీ



ఇంటి గోడను ఢీకొట్టిన ట్రాక్టర్

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రేపల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి పలు క్వారీల నుంచి వస్తున్న ఇసుక లారీలు, ట్రాక్టర్ల అతివేగానికి ఆ రహదారిలో రాకపోకలు సాగించే వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాతూరులో శుక్రవారం ఓ ఇసుక లారీ డ్రైవర్, క్లీనరు ఫుల్‌గా మద్యం తాగి అతి వేగంగా నడపడంతో అదుపుతప్పింది. కరకట్ట కింద భాగంలో చెట్టు మొదలు ఉండడంతో దానికి ఆనుకుని లారీ నిలిచిపోయింది. లేదంటే కింద వున్న నివాసంలోకి దూసుకుపోయి పెను ప్రమాదం జరిగేది. లారీ డ్రైవర్‌ను స్థానికులు ప్రశ్నించగా డ్రైవర్, క్లీనర్ బూతులు తిట్టడం విశేషం. లారీ అదుపు తప్పడంతో రేపల్లె కనకదుర్గ వారధిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట ఇదే గ్రామంలో ఓ ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి ఇంట్లోకి దూసుకుపోవడంతో సామానులన్నీ ధ్వంసం అయ్యాయి. జరిగిన ఈ సంఘటనపై ట్రాక్టర్ యజమాని నష్టపరిహారం కూడా ఇవ్వలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఇసుక వాహనాల దూకుడుకు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడికొండూరు: మండలంలోని డోగిపర్రు అడ్డరోడ్డు వద్ద గల యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్, విద్యాపరమైన ఒత్తిడి తదితర అంశాలపై విద్యార్థులకు సందేహాలను డాక్టర్ ఆశ నివృత్తి చేశారు. కార్యక్రమంలో తులసీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ రాఘవ ఆశ, కాలేజీ కరస్పాండెంట్ రెవ. ఫాతిమామర్రెడ్డి, గైనకాలజిస్ట్ సొసైటీ ప్రెసిడెంట్ జి.శిరీష, సందీప్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి, యూనివర్సల్ కాలేజీ కోఆర్డినేటర్ రమేష్, ట్రెజరర్ పి.రమేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య వైద్య శిబిరంలో 383 మందికి వైద్య పరీక్షలు

వడ్డమాను(తాడికొండ): చెంతకే వచ్చి అందిస్తున్న జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని తుళ్లూరు ఎంపీడీవో బి. శివన్నారాయణ సూచించారు. మండలంలోని వడ్డమానులో జగనన్న ఆరోగ్య సురక్ష-2 లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి శ్రీనివాస్, నలుగురు స్పెషలిస్టు వైద్యులతో నిర్వహించిన శిబిరంలో 383 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, కార్యదర్శి కె. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేములూరిపాడులో 249 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటి వద్దకే ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 249 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ శ్వేత వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎన్ఎం రామిశెట్టి ఆంథోనిరాణి, ఎంపీహెచ్ఏఎం బాబూరావు, ఆశాలు పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి పాల్గొన్నారు.

రైతులపై దాడి పాశవికం

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

మంగళగిరి: రైతుల్ని ఉగ్రవాదుల్లా చూస్తూ వారిపై దమనకాండకు తెగబడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె నుంచి దించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య అన్నారు, యువరైతు శుభ కరణ్‌సింగ్‌ను బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. రైతు శుభ కరణ్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి వై. వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎ. ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరిహారం చెల్లించాలి

తాడేపల్లి రూరల్ : హరియాణా పోలీసుల కాల్పుల్లో అమరుడైన శుభకరణ్ సింగ్ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్‌లో శుక్రవారం రైతు సంఘం నేతలు నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

2న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభ

ఫిరంగిపురం: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పిలుపు మేరకు మార్చి 2న గుంటూరులో నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభను జయప్రదం చేయాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రకాష్ కోరారు. మండంలోని వేమవరం, 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో డ్వాక్రా మహిళలు, గ్రామపెద్దలు, అంబేడ్కర్ యువజన సంఘ నాయకులతో కలిసి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ మార్చి 2న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే సభకు దళిత మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కత్తి పద్మారావు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో పి. రమేష్, చుక్కాబాబు, డి.శ్యామ్, మత్తయ్య, జక్కరయ్య, మార్తమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.